# మినీకథలు........

కాఫీ అందుకుంటున్న రామారావు ఉలిక్కిపడ్డాడు. అనుమానం లేదు,మూడవసారి ఎడమ కన్ను అదిరింది. చచ్చి స్వర్గాన ఉన్న నాయనమ్మ జ్ఞాపకం వచ్చింది. మగవాడికి ఎడమ కన్ను, ఆడదానికి కుడికన్ను అదిరితే అదృష్టం కలసి వస్తుందనేదావిడ. (కొంపతీసి రివర్సులో అనలేదు కదా ముసలమ్మ?)

కన్ను మళ్లీ అదిరింది. అతి త్వర అదృష్టం కలసి వచ్చే సూచనలున్నాయని రామారావు మనస్సు స్థిరనిశ్చయానికొచ్చేసింది.

అదృష్టం ఏ రూపంలో వస్తుందో ఊహకు అందడం లేదు. ప్రమోషన్ ఈ సంవత్సరం వస్తుందని ఎదురు చూస్తున్నాడు. బహుశా అదే అయి ఉండొచ్చు అనుకున్నాడు.

** ** **

ఆఫీస్‌లో ఫైలు చూస్తున్నాడన్నమాటేగాని, రామారావు మనస్సు మేఘాలలో తేలిపోతోంది. ఏ క్షణంలోనైనా ఆఫీసరు మహాశయుడి నుండి ప్రమోషన్ విషయం చెప్పడానికి పిలుపు వస్తుంది కనుక రెడీగా కూర్చున్నాడు.

మనస్సులోని ఆశాదీపం దేదీప్యమానంగా వెలుగుతోంది, అదురుతూన్న కన్నే ఇంధనంగా.

ఎందుకైనా మంచిది, మిగిలిన అదృష్టాల గురించి కూడా ఆలోచిస్తే బాగుంటుందేమో? అనుకున్నాడు.

భాగ్యలక్ష్మి డ్రా ఈ రోజే. టిక్కెట్టు కొనలేదు. కరుణకు అలాంటి అలవాట్లు లేవు కనుక భాగ్యలక్ష్మి ప్రసక్తి లేదు. లక్షల ఆస్తి కలిగి, తనొక్కడే వారసుడుగా గల ముసలమ్మలూ, ముసలాళ్లూ లేరు. జాక్‌పాట్ కొట్టొచ్చన్న అనుమానానికి ఆస్కారమే లేదు. రామారావుకి అశ్వమేధయాగం జరిగే విధానం తెలియదు,

## అదృష్టం



-గోపరాజు వెంకట నరసింహారావు.

అశ్వముల పేర్లు అసలే తెలియదు. పేకాటలో ఏదైనా గొప్ప ఛాన్సు తగులుతుందని ఆశపడ్డం శుద్ధ దండుగ ఇస్పేటుకీ, కళావరుకీ ఉన్న తేడా ఇప్పటికీ తెలియదు.

** ** **

ఆఫీసు అయిపోయింది. ఆఫీసరు పిలుపు రాలేదు, కాని అదృష్టానికి సింబల్ అయిన కన్ను అదరడం మానలేదు.

రోజూ మామూలుగా కనబడే చెట్టు క్రింది జ్యోతిష్కుడు ఈ రోజు దేవుళ్లా కనబడ్డాడు.

మహారాజ యోగం పట్టడానికి కొన్ని గంటలు మాత్రమే వ్యవధి ఉందని, గ్రహాధిపతులందరూ మంచి స్థానాల్లో సర్దుకోడానికి రెడీగా ఉన్నారని, ఆ యోగం అందుకునేందుకు రామారావుని రెడీగా ఉండమన్నాడు.

రామారావులోని నమ్మకం 'ఇంతింతై వటుడింతై' పెరిగిపోయింది. మనస్సులో మూలుగుతూన్న అనుమాన పిశాచాన్ని, ఏ చెట్టు క్రింద జ్యోతిష్యం చెప్పించుకున్నాడో ఆ చెట్టు చిటారు కొమ్మకు తరిమేసాడు.

** ** **

ముచ్చటగా మూడు రోజులయింది. రామారావు లెక్కల ప్రకారం కన్ను మూడు వందల సార్లు అదిరింది (రామారావు చిన్నప్పుడు లెక్కల్లో ఫస్ట్)కాని ఏ విధమైన శుభవార్త వినలేదు.

ఈ మూడు రోజుల్లో జరిగిన ఈ విశేష కార్యక్రమాన్ని గురించి కరుణకి వివరంగా చెప్పాడు. కరుణ మెదడు 'కంప్యూటర్' అని రామారావు గాఢమైన నమ్మకం. ఈ 'డేటా' అంతా 'ఫీడ్' చేస్తే ఆన్సర్ వస్తుందని తెల్పు.

కరుణ జవాబు క్షణంలో వచ్చేసింది. మరునాడు రామారావుని ఆఫీస్‌కి సెలవు పెట్టమని, పతిదేవుని సుందర ముఖార విందంలోని నయన పరీక్షార్థం కళ్ల డాక్టరుగారిని కలిస్తే శ్రేయస్కరమని సలహా ఇచ్చింది.

** ** **

రామారావుకి ఇప్పుడు కన్ను అదరడం లేదు. అతని కన్ను అదిరితే వచ్చే అదృష్టం ఇష్టంలేని డాక్టరు, రామారావు కళ్లకి కావలాగా కళ్లజోడు తగిలించాడు.

# నూరేళ్ళ1(వన్)ట

ఇరవై ఏళ్ళ తర్వాత, అనుకోకుండా కలసారు, గంగారాం, సీతారాం. ఇక, ఆ స్నేహితులకు కబుర్లకు కొదవా?, గంట నుండీ చెప్పుకుంటున్నా తరగడం లేదు. వాళ్ళు కూర్చున్న హోటల్లో అట్టే జనం లేరు. అంచేత వాళ్ళ మాటలకు అడ్డు ఎవరూ రాలేదు. కాలేజీ రోజుల్లో ప్రిన్సిపాల్ స్కూటర్ పెట్రోల్ టాంకులో చక్కెర ఎలా పోసిందీ చెప్పుకున్నారు, తమ భార్యలకు తెలీకుండా మందు ఎలా అందుకుంటున్నదీ చెప్పుకున్నారు. తర్వాత కాసేపటికి...

“ఒరే సీతారాం! జీవితంలో చిన్న చిన్న పొరపాట్లు కూడా ఒక్కోసారి పెద్ద పెద్ద శిక్షలు విధిస్తాయిరా!” నిట్టూరుస్తూ చెప్పాడు గంగారాం. పెద్దగా శబ్దం చేస్తూ వాళ్ళ టేబుల్ మీద ఉన్న కాఫీ కప్పులు కిందపడి పగిలిపోయాయి. కంగారుగా వచ్చిన సర్వర్ చేతిలో పదిరూపాయలుంచి అన్నాడు గంగారాం, “మాసేవా! నిట్టూర్చిన చిన్న పొరపాటుకు పది పరిహారం!”

చిన్నగా నవ్వి, అడిగాడు సీతారాం “సరేగాని, ఎందుకిలా అంటున్నావ్?”

“నిజంరా! పదిహేనేళ్ళ క్రితం, పెళ్ళయిన కొత్తల్లో, నా భార్యకోసారి జబ్బు చేస్తే, వంట నన్నే చేయమంది”

“కొంపదీసి చేసేవా?” ఆదుర్దాగా అడిగాడు సీతారాం.

“ఊ కొన్ని ప్రత్యేక రకాలైన బొగ్గులు తయారయ్యాయి. దానికి ఫలితంగా ఇప్పటికీ హేళనలు, జోక్స్, భరించాల్సి వస్తోంది..” దీనంగా అన్నాడు గంగారాం.

అంతా విన్న సీతారాం పెద్దగా నిట్టూర్చి అన్నాడు-




“నా కంటే నయం!” పెద్దగా శబ్దం చేస్తూ పక్క టేబుల్ మీద ఉన్న పళ్ళాలు, కప్పులు కిందపడి ముక్కలయిపోయాయి. తాపీగా వచ్చిన సర్వర్ చేతిలో ఇరవై రూపాయలు ఉంచాడు సీతారాం. డబ్బు తీసుకెళ్తూ అన్నాడు సర్వర్ “ మీరు పుట్టించిన హోరుగాలికి కొన్ని ఇళ్లులు ఎగిరిపోయాయ్!”

రెండు నిముషాల తర్వాత, తేరుకుని అడిగాడు గంగారాం:

“కొంప దీసి నీవు కూడా వంట చేయాల్సి వచ్చిందా?”

“కొంప తీయకుండానే చేయాల్సి వచ్చింది”

“నీవు కూడా బొగ్గుల్ని తయారు చేసేవా?” ఆదుర్దాగా అడిగాడు గంగారాం.

“లేదు మాంచి ఘుమ ఘుమ లాడే కూర తయారు చేసేను”

“గుడ్! మరింకేం?!”

“నీ ముఖం గుడ్డు! వంటనేనే బాగా చేస్తానని సాకుతో వంట గది నాకే అప్పగించేసింది నా భార్య. అఫ్‌కోర్సు అప్పడాలకర్ర మాత్రం తన దగ్గరే ఉంచుకుందనుకో!.. అరె .. కబుర్లలోపడి కాలాన్ని మర్చిపోయాము. సరే.. మరి నే వస్తా.. ఇంటికెళ్ళి గిన్నెలు కడిగి, వంట చేయాలి” అంటూ పెద్ద పెద్ద అంగలేస్తూ కనుమరుగయిపోయాడు సీతారాం.

సరిగ్గా పావుగంట పట్టింది గంగారాం తేరుకోడానికి.

పెద్దగా నిట్టూర్చి “ప్చ్! వీడి కేసింకా దారుణం!” అనుకున్నాడు.

సర్వర్ వచ్చి బిల్ అందించి చెప్పాడు “యు ఆర్ లక్కీ సార్.. టేబుల్ ఖాళీగా ఉంది!”

—ఎస్.డి.గిరి